


అన్నయ్యనూ నన్నూ ఒకేసారి చూస్తే మేం ఇద్దరం అన్నదమ్ములమని ఎవరైనా సరే తేలిగ్గా చెప్పగలిగేవారు. కాని నో మాదు రోజులు మా ఇద్దరితోనూ కలిసి తిరిగితే, మేం ఇద్దరం అన్నదమ్ములమేనా అని వాళ్లకే సందేహం వచ్చేది!

అన్నయ్య చాలా మంచివాడనీ, నేను వాడికి వ్యతిరేక పదార్థాన్నీ చెప్పుకునేవారు కొందరు! అన్నయ్యలా ప్రవర్తించడానికి ప్రయత్నించమని, నాకు సలహా ఇచ్చేవారు మరికొందరు! 'అది నా ప్రాణం వాళ్ల కాదు, క్షమించండి!' అనేయడమే అలవాటయింది కానీ, అన్నయ్యలా మంచిపేరు తెచ్చుకుందామని ఎప్పుడూ బుద్ధిపుట్టేది కాదు. అసలు నా స్వభావానికి అంటేనే నాకు పరమ అసహ్యం. మాట్లాడితే, పరాయివాళ్లన్నా, మా బంధువు లన్నా నాకు ప్రత్యేకమయిన దిగులు. వాళ్లనేమాటలు నే నెప్పుడూ లెక్కచేయను — నా వ్యక్తిత్వం నాది, నా పోలికలు నాకున్నాయి. నా స్నేహితులు నాకున్నారు. నా కిష్టమయిన పనులు నేను చేస్తాను. మిమ్మల్ని ఏదో అనుకుంటారని, అంటారని, నే నేదో చేయదలచుకున్న పనులు నే నెప్పుడూ మానలేదు! అలాగే, ఎవళ్ల మెప్పు పొందాలని నా కిష్టంకాని పనులూ నే చెయ్యలేదు! అయితే అన్నయ్య విషయము అలా కాదు! పెద్దపేరంటే వాడికి ఆశ. ఎవరైనా తన గురించి కాస్త పెద్దగా చెప్పుకున్నారని తెలిస్తే చాలు. తెగ బాధపడిపోతాడు. అక్కడే మా ఇద్దరికీ బాగా తేడా కనిపిస్తుంది.

"నీ వ్యక్తిత్వం గురించి నువ్వు ఆలోచించుకోవేమిరా?" అని అడిగేవాణ్ణి అన్నయ్యని.

"మనిషిగా బ్రతికి మంచిపేరు తెచ్చుకోకపోతే, ఇంక మనం బ్రతికేది ఎందుకూ?" అనేవా డన్నయ్య.

ఇంతకూ నేను మాట్లాడేది నో మూడేళ్ల క్రిందటి మాట! ఇప్పటి పరిస్థితి గురించి తర్వాత చెప్తాను.

మా ఇద్దరి మధ్యా అంత తేడా ఎందుకు ఉండేదో, ఈ క్రింది విషయాలు చదివితే, మీకే తెలుస్తుంది.

మేం పుట్టింది తూర్పు గోదావరి జిల్లాలోని నో పల్లెటూళ్లో! మా నాన్నగారు పూర్వకాలపు బియ్యే చదువుకుని కొంతకాలం రాజకీయాల్లో పనిచేసి, తర్వాత వ్యవసాయంలోకి దిగిపోయారు. క్రొత్త అనుభవాలంటే ఆయన కిష్టం. అందుకే మమ్మల్ని ఆయనకు చాలా దూరంగా ఉంచే చదివించారు. ఆరేళ్ల ప్రాయమొచ్చేసరికి అన్నయ్యని మద్రాసు పంపించేశారు, పెదనాన్నగారి ఆధ్వర్యంలో నో కాన్వెంటు స్కూల్లో చదివించడానికి. అలాగే నన్ను ఆరేళ్లు నిండకుండానే బొంబాయి తోలేశారు. పెద్దమ్మగారింట్లో ఉంచి అక్కడి 'ఆంధ్రా సొసైటీ' వాళ్ల స్కూల్లో చదివించడానికి.

ఏడాదికోసారి మాత్రం మమ్మల్నిద్దర్నీ మావూరు రప్పించుకునేవారు. సరిగ్గా వేసవి సెలవల్లో మావూళ్లో గడప నిచ్చేవారు. వెంటనే మా ఇద్దర్నీ చెరో వైపుకీ పంపించేసేవారు — పాపం, మా అమ్మ కన్నీళ్లు నాన్నగార్ని ఏమాత్రం కరిగించలేకపోయేవి.

చిన్నప్పటి రోజులు అలా జరిగిపోయాయో జరిగిపోయాయి! నాకు సరిగ్గా పదహారేళ్లు వచ్చిందగ్గర్నుంచి జరిగిన విషయాలే బాగా గుర్తున్నాయి. మావూరు నో చిన్న పట్టణంగా తయారయింది. హైస్కూలు, ఆస్పత్రి మొదలైనవన్నీ వచ్చేశాయి. బొంబాయి నుంచి నేను, మద్రాసు నుంచి అన్నయ్యా నేరుగా సెలవలకి అక్కడికి వెళ్లే మాకు కాలక్షేపానికి కావలసినవన్నీ ఉండేవి. పూర్వంలా ఇద్దరినీ మమ్మల్ని కొంచెం వింతగానే చూసేవారు. వచ్చినప్పుడో, ఆ మర్నాడో మా చుట్టాలందరిళ్లకీ వెళ్లి కనిపించి వచ్చేవా డన్నయ్య. నన్ను తన కూడా రమ్మనేవాడు అక్కడే మా ఇద్దరికీ

ఉడాయి మొదలయ్యేది—నే రానన్నేవాడిని. ఎందుకో చెప్పమంటారా ? అచ్యుతం బాబయ్యగారింటికి వెళ్ళాననుకోండి. "అంత దూరాన్నుంచి వచ్చావు. ఎలాగుంటున్నావో ఏమిటో, వచ్చి పలకరిద్దామని నిన్న రాత్రి నుండి ప్రయత్నం ! మాయపిల్లలూ, మాయ సంసారమూను. ఒక్క నిమిషం కాళీ కనుపించ దనుకో. చంటిదానికి రాత్రి నుంచి ఒకటే జ్వరం. ఇదిగో చూశావా వీడి నాలకం, తీరి కూచుని అరుగుమీంచి పడ్డాడు పొద్దున్నే ! మొహంమీద యింత బొప్పి కట్టేసింది. వాళ్ళు కుదురుగా ఉండరు. మనల్ని కుదురుగా ఉంచరు. మాయ సంతానం. అబ్బబ్బ, ఘడియ ఓ గండంగా గడుస్తోందనుకో! సరేలే! నా పొదంతా మాటకేంగాని, ఏం క్రిందటి మాటొచ్చినప్పుడు కంటే కొంచెం చిక్కిపోయావు. వంట్లో బాగుంటంలేదా?" అంటూ తన కుశలప్రశ్నలలోని మొదటి అధ్యాయం ముగించేది ఆ పెద్దమ్మ ! ఆ తర్వాత వినడమే తరవాయి గాని, అధమం ఓ గంట సేపైనా అలా నిలబెట్టి సునాయాసంగా చెప్పుకుపోయేది. "ఇంక చాల్లే!" అనేద్దామనే సమయం వచ్చాక గాని వదిలేదికాదు. అలాటి అనుభవం నాకు తెలిసొచ్చాక ఒకే ఒకసారి అనుభవించాను. అంతే, ఆ యేటి నుండీ అలా వెళ్ళడం మానేశాను. అన్నయ్య సంగతి వేరని ముందే చెప్పేనుగా !

క్షమించండి, అసలు విషయం వదిలి పెట్టేస్తున్నానేమో! ఈ పై విషయాలన్నీ మీకొకందుకు చెప్పవలసి వచ్చింది. మే మిద్దరం అన్నదమ్ములమైనా, ఇద్దరం ఒకర్ని ఒకరు అర్థంచేసుకుందుకు మా కెప్పుడూ సావకాశం లభించలేదు. ఏడాదికోసారి కలుసుకునేవాళ్ళమేమో, ఒకళ్ళ మీద ఒకళ్ళకి ఎంతో ప్రేమ, జాలి కలిగేవి. ఆ నెల్లాళ్ళూ, అప్పుడప్పుడు దెబ్బలాడుకున్నా గాని ఇద్దరం చాలా దగ్గరగా మసిలేవాళ్ళం.

* * *

మూడేళ్ళ క్రితం నా వయసు సమంగా ఇరవై యేళ్ళు. బియస్సీలో చేరాను. అప్పటికే అన్నయ్య ఎం. ఏ. పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం సిద్ధంగా ఉన్నాడు. అన్నయ్య యూనివర్సిటీ చదువు మాత్రం తిరుపతిలో జరిగింది.

నేను ఎమ్మెస్సీలో జేరిన మూడు నెలలు తిరక్కుండానే అన్నయ్య నుంచి ఉత్తరం వచ్చింది—విశాఖపట్నం జిల్లాలో ఓ పల్లెటూరు, పట్నవాసం కానివూళ్ళో తనకు ఉద్యోగం దొరికిందని రాశాడు. దీపావళి సెలవులకు నన్ను ఆవూరు రమ్మని ఆహ్వానించాడు.

అన్నయ్య ఉత్తరం నాకు కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించింది—'ఎం.ఏ. ఎకనామిక్స్ ఫస్టు క్లాసులో పాసయినవాడు పోయి పోయి అలాటి వూళ్ళో ఉద్యోగం చూసుకున్నా డేమిటా !' అని. ఆవూరు మరేవూరూ కాదు. మా మేనమామగారి వూరే! నాకు పదేళ్లున్నప్పు డెప్పుడో ఓసారి వెళ్ళాను. అప్పటికావూరు పూర్తిగా పల్లెటూరే .

అన్నయ్యనుండి పది రోజుల తర్వాత మరో ఉత్తరం వచ్చింది. ఆవూరు మావయ్యగారమ్మాయి 'శ్యామల' పూనాలో చదువుతోందనీ, ఎప్పుడైనా నేపూనా వెళ్ళడం తటస్థిస్తే ఆమెను కలుసుకోమనీ రాశాడన్నయ్య. అసలా మామయ్యగారికీ మాకూ చాలా రోజులనుండి మంచి సంబంధాలు లేవు. అన్నయ్య వెళ్లిన తర్వాత పరిస్థితులను మార్చేశాడు.

ఆ ఉత్తరం వచ్చిన నెల్లాళ్ళకి నేనోసారి పూనా వెళ్ళాను. 'శ్యామల' ను కలుసుకున్నాను. బి. ఎస్. సి. రెండవయేడు చదువుతోందిట! కాన్వెంటులో చదివినపిల్ల కావటంవలన చాల హుషారుగానే ఉంది. తను కూడా ఎప్పుడో ఏడాదికోసారి తప్ప అస్తమానూ వాళ్ళ వూరెళ్ళేదిలేదుట. అన్నయ్య వాళ్ళ వూరుకి పోయి ఉద్యోగం చూసుకున్నందుకు శ్యామల కూడా కొంచెం ఆశ్చర్యం వెలిబుచ్చింది. వాళ్ళవూరు మంచి చెడ్డలను గురించి మాట్లాడింది. మాకు మావూరెలా నచ్చదో శ్యామలకుకూడా అదేవిధంగా వాళ్ళవూరన్నా, వాళ్ళవూరువాళ్ళన్నా అసహ్యం.

"ఏడాదికోసారి వెళ్తాను గనుక మా వూరు కొంచెం హాయిగానే కనుపిస్తుంది. కానిపూర్తిగా నెల్లాళ్ళు గడవకుండానే అక్కడుండడం విసుగెత్తుతుంది. తిరిగిపూనా ఎప్పుడు వచ్చిపడతానా అని ఒకే ఆతురతగా ఉంటుంది" అని చెప్పింది శ్యామల.

మరి పెర్మనెంటుగా అవూళ్ళోనే ఉండిపోడానికి అన్నయ్యకెలా మనసొప్పిందో అర్థంకాలేదు మా యిద్దరికీ.

* *

దీపావళి సెలవులకి అన్నయ్యగారివూరు వెళ్ళాను. స్టేషనుకు వచ్చి, ఆప్యాయంగా ఆహ్వానించాడు అన్నయ్య. తను నాకన్నా పెద్దవాడన్న సంగతి మరచి, నా చేతులో హేండ్‌బాగ్ తాను తీసుకున్నాడు. నాకు తెలియకుండానే నా మనసు 'అన్నయ్య ఎంత మంచివాడు!' అనేసింది.

ఓ రిటైర్డు పోస్ట్‌మాస్టారింట్లో మేడ మీద గది అద్దెకి తీసుకున్నా డన్నయ్య! హోటల్లో భోజనంట! బొంబాయినుంచి వెళ్లినవా డెవడైనా సరే అసలా హోటల్లో అడుగుపెట్టడానికే సందేహిస్తాడు. లోపల ఫరవాలేదు, కాస్త డీసెంటుగానే ఉందనుకోండి! అన్నయ్యను చూసి జాలేసింది. మామయ్యగారింటికి తీసికెళ్ళాడా రాత్రి. అత్తయ్యా, మామయ్యా అన్నయ్యమీద చాలా చాలా మంచి రిపోర్టులు ఇచ్చారు. అన్నయ్య పనిచేసే కంపెనీ యజమాని గారు అన్నయ్యను ప్రాణంలా చూచుకుంటున్నారట. అన్నయ్యలాటి మనిషిని ఎవడైనా ఆమాత్రం గౌరవిస్తాడు. దాంట్లో పెద్ద విశేషం నాకేమీ కనుపించలేదు. నా దిగులు ఒక్కటే! శుభ్రంగా ఏ పట్నవాసంలోనో అయితే, అన్నయ్య బాగా పైకివచ్చే అవకాశాలుండేవి. పెద్ద పట్నాల్లో తెచ్చుకోగలిగే జీతం కంటె ఎక్కువే సంపాదిస్తున్నా డన్నయ్య. ఆ విషయము నన్ను సంతృప్తిపరచలేదు.

మామయ్యగారింటినుండి వస్తూ అన్నయ్యతో వాదన ప్రారంభించాను. తానసలా వూళ్ళో ఎందుకు ఉద్యోగం చెయ్యాలని! అన్నయ్యది అదో రకమైన మనస్తత్వం. పల్లెటూరి వాతావరణమే తనకు నచ్చుతుం దన్నాడు. ముఖ్యంగా ఆవూళ్ళో తన నాకర్షించిన ప్రదేశాలు, విషయాలు చాలా చాలా ఉన్నాయన్నాడు. తన వాదన నిరూపించడంకోసం నన్ను ఒకొక్కసారి ఒకొక్క చోటకు తీసుకెళ్లేవాడు. అంటే ఉదాహరణకి ఒక్క విషయం చెప్తాను. సాయంత్రము ఏడుగంట లయింది. ఆవూరు పంచాయితీ పార్కులో ఫ్లోరసెంట్ దీపాలు వెలిగాయి. ప్రక్కనే ఉన్న చెరువు తాలూకు అవతలిగట్టుకు తీసికెళ్లాడు. అక్కడ మరేమీ విద్యుద్దీపాలు లేవు. రెండు మూడు బెంచీలు మాత్రం ఉన్నాయి. అక్కడ కూర్చోమన్నాడు. మా కెదురుగా నున్న ములగచెట్లను చూడమన్నాడు. కావలసినంత చల్లనిగాలి చెరువుమీంచి వస్తోంది. తెల్లని ములగపూవులపై

ఆ పార్కు దీపాల నుంచి వచ్చే కాంతి పడుతోంది. నిశ్శబ్దంగా ఉంది. అటు వైపు చూసి నన్ను నేనే ఒక్క క్షణం మరచిపోయాను. నిజంగా ఆహ్లాదంగా కనుపించిందా దృశ్యం.

"బొంబాయిలో 'క్వీన్స్ నెక్లెస్' దృశ్యం ఇంతకంటే బాగుంటుందా ?" అంటూ భుజంమీద తట్టా డన్నయ్య ! ఆక్షణంలో అన్నయ్యతో ఏకీభవించ వలసి వచ్చింది.

అయితే ఒక్క సంగతి! అన్నయ్య చెప్పిన వన్నీ బాగానే ఉన్నాయి కాని, వాటిని అన్నయ్య దృష్టితో చూస్తే తప్ప, నాకు గాని, నాలాంటి వాళ్లకిగాని, అన్నయ్య తీసుకున్న నిర్ణయం నచ్చదు.

అంతవరకూ అన్నయ్య నందరూ మంచివా డంటూంటే, చెప్పకపోవడమేం, నాకు కొంచెం అసూయ కల్గేది. కాని, ఆవేళ ఆవూరువాళ్లంతా అన్నయ్యను మంచి వాడంటూంటే అన్నయ్యమీద మొదటి

# మంచితనం

సారిగా జాలి కల్గింది. నే నక్కడున్న పది రోజులూ మేమిద్దరం చాలా సరదాగా గడిపేశాం ! అన్నయ్యలోని ప్రతి అంగుళాన్నీ బాగా అర్థంచేసుకో గలిగాను. అన్నయ్య అంతవరకు ఉత్త అన్నయ్యలాగే కనుపించేవాడల్లా, అంతకంటె చాలా ఉన్నతంగా కనుపించాడు. ఆ ఉన్నతస్థానంలో కనుపించిన అన్నయ్య నాలో ఏదో తెలియని చైతన్యాన్ని రేకెత్తించాడు. "అన్నయ్యలాంటి హీరో ఒకడు సృష్టించ బడితే, అతని కథ ఎంత బాగుంటుంది ?" అనిపించింది వెంటనే !

ఆ ఆలోచన కలిగిన నాటినుంచీ నాకు విశ్రాంతి లేకపోయింది. అన్నయ్యజీవితాన్ని నూటికి నూరుపాళ్లూ అర్థం చేసుకుందికి మరో రెండు రోజులు తాపత్రయ పడ్డాను. నే వేసే కొన్ని ప్రశ్నలకు జవాబియ్యడానికి తికమక పడేవా డన్నయ్య.




తిరిగి బొంబాయి వచ్చేటప్పుడు రైలు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకో గలిగాను. నే నూహించుకున్న "హీరో" ని సృష్టించుకో గలిగాను. అంతకుముందు రెండు మూడు కథలు రాసినా, "ఈ క్రొత్త హీరో ముందు, ఆ పాత కథ నాయకులందరూ ఏపాటి ?" అనిపించింది. కథ మాత్రం ఏమీ రాయలేదు. ఉత్తినే 'కథానాయకుడిని' మాత్రం సృష్టించు కొన్నాను.

నే రాసుకున్న విషయాలు అన్నయ్యకు పంపుదా మనుకున్నాను సరదాగా! అన్నయ్యకు కోపం వస్తుందేమోనని భయం వేసింది మొదట్లో ! కొన్నాళ్లు ఆలస్యం చేశాను. మరి కొన్నాళ్లకి ఆ వూహే నచ్చలేదు. పది నెలలు గడిచాయి. ఒక నాడు పాత కాగితాలు తిరగేస్తుండగా అన్నయ్య గురించి నే రాసుకున్న కాగితాలు బయట పడ్డాయి. అవి చదువుకునేసరికి అన్నయ్య కాగితాలు పంపుతేనే బాగుంటుం దనిపించింది. వెంటనే నే రాసుకున్న విషయాలో కొన్నింటిని మాత్రం విడిగా వో కాగితంమీద వ్రాసి, ఒక ఉత్తరం జతపరచి, అన్నయ్యకు పంపించాను.

నే రాసి పంపించిన నాలుగు ముక్కలూ ఇవి :

రామారావు ఎలాంటివాడని ఆ వూళ్లో ఎవర్ని అడిగినా ఒకే ఒక్క సమాధానం వస్తుంది. 'చాలా మంచివాడు' అని! 'రామారావు లేకపోతే అసలీవూరు ఎలాగుంటుందో వూహించలేం' అంటారు కొందరు. ఆవూరు కంతకీ ధనికులయిన వెంకట్రామయ్యగారి ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు రామారావు. ఆ కంపెనీలో పనిచేసే ప్రతి వ్యక్తికీ రామారావుతో పని ఉండడం సహజంగానే కనుపించవచ్చు. అయితే ఆ సైకిలుషాపు వెంకన్న దగ్గర్నుంచి హైస్కూలు హెడ్మాష్టరయిన రంగారావుగారి వరకూ చదువుకోనివాళ్లకీ, చదువుకున్నవాళ్లకీ, రామారావుతో అంతో ఇంతో పని ఉంటూనే ఉంటుంది.

కంపెనీ యజమాని వెంకట్రామయ్యగారికి రోజంతలోనూ అధమం వో అర గంటయినా రామారావు తన ప్రక్కనుంటేనే గాని పనులు జరుగవు. కంపెనీ విషయాలే కాకుండా ఆయన కుటుంబ విషయాలన్నీ కూడా రామారావే చూసుకోవాలి.

(46 వ పేజీ చూడండి)


సైకిలుషాపు వెంకన్న మెడ్రాసు ఫ్యాక్టరీ నుంచి ఏమైనా తెప్పించుకోవాలంటే ఆ విషయాలన్నీ రామారావే చూసిపెట్టాలి.

హోటలయ్యరు తన అల్లుడికి తెలుగు భాషలో ఉత్తరం రాయలేడు. అర్థవం బాగా తెలిసిన రామారావొక్కడే ఆ వూళ్లో ఆయనకా పని చేసిపెట్టగలడు. అందుకే రామారావంటే హోటలయ్యరుకి ప్రత్యేకమైన అభిమానం.

రామారావుంటున్న ఇంటి యజమాని కమలయ్యగారి మనవ లందరికీ కూడా రామారావుతో పని ఉంది—అత నింటికి రాగానే జేబులు తడిమేస్తారు. చాక్లెట్ల కోసం! అతడు వాళ్ల నెప్పుడూ నిరాశ పరచడు. అందుకే వాళ్ల దృష్టిలో కూడా రామారావు 'చాలా చాలా మంచి వాడు!'

ఆవూరు జనరల్ మర్చంటుగారి పిల్లల చదువుల విషయంలో రామారావే సలహా లివ్వాలి. ఆవూళ్లో ఎవరికైనా బాగా సుస్తీగా ఉంటే, వాళ్లని విశాఖపట్నం హాస్పిటల్లో జేర్పించడానికి రామారావే వెళ్లాలి.


30 సం॥ లుగా
ప్రసిద్ధి చెందినది




ఫ్రూటాల్ ★ ఫ్రూటాల్

అన్నివేళలా సేవించదగిన
ఉత్తమ పానీయం.


# మంచితనం

(12 వ పేజీ తరువాయి)

ఇదంతా చదువుతోంటే మీకు కొంచెం ఆశ్చర్యం కలగవచ్చు. కారణాలు చెప్తా వినండి. రామారావంత చదువుకున్న వ్యక్తులు ఆ వూళ్లో అసలు లేనేలేరు. అసలు రామారావుని చూడగానే ఎవరికైనా సరే వో అయిదు నిముషా లతనితో మాట్లాడుతే బాగుండు ననిపిస్తుంది. అతడు మంచి వయసులోనున్నవాడే అయినా, బాగా ఆధునిక యుగానికి చెందినవాడిలాగే వేష భాషల్లో కన్పించినా, రామారావుకి విశేషమైన ఓర్పు ఉంది, ఎదటివాళ్లను ఏ సందర్భంలోనూ చిన్నబుచ్చడు రామారావు. ఎదటివాళ్ల మాటలు తనకు అస్సలు నచ్చకపోయినా శ్రద్ధగా విని వూరుకుంటాడు బోళ్లన్ని పనులలో తను నిర్విరామంగా ఉన్నా సరే, ఎవరే చిన్న సహాయం కోరినా చేయననడు రామారావు 'నడిచే ఎద్దునే పొడుస్తా' రన్నట్టు అందుకే అతనికి పని చెప్పడాని కెవరూ సందేహించరు.

అందరూ రామారావుని మంచివా డనడం మాట అలా ఉంచండి. ఆవూరన్నా, ఆ వూరువాళ్లన్నా కూడా రామారావు కెంతో ఇష్టం! అనాగరికులయిన ఆ వూరు ప్రజల్ని అసహ్యించుకోడం బదులు జాలిపడ్డాడు. ఆ వూరికి నడుమటగా ప్రవహించే చిన్న నది, ప్రక్కనున్న ఇసుకతెన్నెలు, మామిడి తోటలు, ఇవన్నీ అతని అలసటను తేలిగ్గా మరపింపజేస్తాయి. ఆ నది వడ్డున కూర్చుంటేనే చాలు—గంటలు నిముషాల్లా గడిచి పోతాయి రామారావుకి!

రామారావుని అందరూ మెచ్చుకుంటా రని చెప్పాను. అతని ప్రవర్తనని హర్షించని వ్యక్తులు కూడా ఆవూళ్లో ఒకళ్లిద్ద రున్నారని చెప్తే ఆశ్చర్యపోతారేమో! — ఆ వూరు హైస్కూల్లోనే పదవ తరగతి చదువుతున్న పదహారేళ్ల 'కమల' (హెడ్మాస్టరుగారమ్మాయి) రామారావా దారిన ఎప్పుడు పోతున్నా ఆశగా మేడమీంచి చూస్తుంది, రామారా వొక్కసారైనా తల పైకెత్తి తన వైపు చూస్తాడేమోనని! ఆ విషయం బహుశా రామారావుకు తెలిసి ఉండదు— పాపం, ఆమె ఎప్పుడూ నిరాశ చెందవలసి వస్తుంది.''

ఈ ఆఖరి పేరా ఎందుకు రాశానో మీరు గ్రహించగల రనుకుంటాను. తనలో ఉన్న ఆ చిన్ని లోపం అన్నయ్యా సరిదద్దుకో గలుగుతాడనే!

అన్నయ్య నుండి ఎలాటి జాబు వస్తుందో నని ఒకే భయంగా ఉండేది ఆ వారం రోజులూ! అన్నయ్య వెంటనే ఉత్తరం వ్రాశాడు.

"తమ్ముడూ! నీవు రాసి పంపించిన విషయాలు చదివి, నువ్వు నన్నంత మంచిగా అర్థం చేసుకున్నందుకు ఎంతో సంతోషించాను. నాకు తెలియకుండానే రీవీపని సాధించగలిగినందుకు అభినందిస్తున్నాను. అయితే చిన్న కోరిక! ఆ ఆఖరి పేరా మాత్రం తీసేసి, ఈ క్రింది నాలుగు మాటలూ పై విషయాలతో జతపరచి, నీ అభిప్రాయాన్ని తెలియజెయ్యి!'' అంటూ మొదలెట్టి, అన్నయ్య తన ఉత్తరంలో బలే బలే విషయాలు, తీయతీయని మాటలలో రాశాడు నాకు పరమ సంతోషమయింది!—అన్నయ్య అంత నిర్విరామంగా ఉంటూ కూడా, తన హాబీల విషయం మరువడట! అలా సాయంకాలాల్లో నది వడ్డుకు వెళ్లినప్పుడు తన మనసులో కలిగే భావాలన్నీ తన కవిత్వధోరణిలో కాగితంమీద రాసేసుకుంటాడట. వో మూడు నెల్ల నుండి ఆవూరుకు ప్రక్క వూళ్లోనే ఉంటున్న వో చక్కని చుక్కతో పరిచయం కూడా ఏర్పడిందట ఆమె తండ్రిగారు డిఫెన్సు సర్వీసులో రిటైరయి శాశ్వతంగా నివాస మేర్పరచుకోడం కోసం తమ స్వగ్రామానికి వచ్చేశారుట. ఆమెకు పాపం తల్లి లేదుట లూథియానాలో వో మంచి కాన్వెంటులో చదివి బి. ఎస్. సి. చదువు పూర్తిచేసుకున్న 'ఆమె' అన్నయ్యను తేలికగానే ఆకర్షించ గలిగిందట. ఇంటి పని అంతా చూసుకుంటూనే అలా సాయం సమయాల్లో నది వడ్డుకు పదేళ్ల తన తమ్ముడితో షికారు రావడానికి వీలుచేసుకునే ఆమెను చూస్తే అన్నయ్య కెంతో జాలి కల్గుతుందట. వాళ్లిద్దరి మధ్యా స్నేహం ఎలా ఏర్పడిందో అది ఎలా అభివృద్ధి చెందుతోందో కూడా రాశా డన్నయ్య. భరతనాట్యం నేర్చుకుందట. చక్కగా పాటలు పాడుతుందట. 'ట్విస్ట్' కూడా తెలుసునట. ఆమె పేరు 'రమ'. తన నెలా నవ్విస్తుందో, ఎలా కవ్విస్తుందో వర్ణిస్తూ రాశాడన్నయ్య.

అన్నయ్య నెలా అభినందించాలో అర్థం కాలేదు. దగ్గిరుంటే ఎత్తి కుదేసేవాణ్ణి, "ఇప్పుడు నా 'హీరో' లో నూటికి నూరు

వీళ్ళు కథానాయకుడి లక్షణాలున్నాయి." అనుకుంటూ నన్ను నేనే అభినందించుకున్నాను.

*   *   *

ఆయేటి వేసవి సెలవలకి ముందుగా అన్నయ్య దగ్గర కెళ్ళాను. ఒకనాడు సాయంకాలం ఆ నది వడ్డుకు నన్ను తీసుకెళ్ళాడన్నయ్య ! 'ఆమె' తన తమ్ముడితో వచ్చి అవతలి గట్టున నిలబడింది. మేమే అవతలి వైపుకి వెళ్ళాము.. ఆమెను నాకు పరిచయం చేశాడన్నయ్య! ఓ గంటన్నర పైగా కాలక్షేపం చేశాము. ఆ కొద్ది నిముషాల్లోనే ఆమెను బాగా అర్థం చేసుకోగలిగాను. చాలా ఆశ్చర్య మనిపించింది. ఆమె మాటలో, నడవడికలో అత్యాధునిక మైన నాగరికత ఉట్టిపడుతోంది. అంత చురుకైన పిల్ల ముందు అన్నయ్య ఒక జడపదార్థంలా కనుపించాడు. అయినా, అన్నయ్యంటే ఆమెకు ప్రాణం. ఆమెకు భాషను బాగా తెలుసు. అన్నయ్య వాటిని మెచ్చుకున్నాడు. అన్నయ్యలో మంచితనం ఉంది. దాన్ని ఆమె అర్థం చేసుకుంది. ఇద్దర్లోనూ అందం ఉంది. దాంతోపాటు యిద్దరికీ మంచి నిగ్రహం ఉంది. అందుకే చాలారోజు లలా మెల్లిగా జరుగనిస్తున్నారు.

"సుఖంగా వో స్కూటర్ కొనుక్కోరా! హాయిగా తిరగొచ్చు!" అన్నాను. అన్నయ్య నవ్వేశాడు. "రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్ లాగేఉండాలి ! ఈవూళ్ళో స్కూట రెక్కితే ఇంకేమైనా ఉందా ?" అన్నాడు. అంతకంటె అన్నయ్య స్వవిషయంలో నే జోక్యం కలిగించుకోలేదు. తన ప్రేమ వ్యవహారాన్ని నాన్నగారికి కూడా తెలియనియ్యవద్దన్నాడన్నయ్య.

తిరిగి బొంబాయి వచ్చేశాను. నా ఎం. ఎస్. సి. చదువు పూర్తయ్యేలోపున జరిగిన విశేషాలు మరేమీలేవు కాని, ఒక్కటే ఒక్క విషయం చెప్పాలి ! ఆ ఏడు నాలుగైదుసార్లు పూనా వెళ్ళవలసిన పను లు తగిలాయి. అక్కడ కెళ్ళినప్పుడల్లా శ్యామలను కలుసుకోడం జరిగింది. శ్యామల ఒకటి, రెండుసార్లు బొంబాయి వచ్చిన సందర్భాలలో నన్ను కలుసుకుని మరీ వెళ్ళేది.

శ్యామల చాలా చురుకైన పిల్ల, ఇంచుమించు అన్నీ నా లక్షణాలే! తను చేయాలనుకున్న పని, ఎవరో ఏదో అనుకుంటారని భయపడకుండా చేసేస్తుంది. ఈ సొసైటీమీద తనకున్న అసహ్యాన్ని, నిర్లక్ష్యాన్నీ వ్యక్తపరుస్తూ "మానవుడూ,— మట్టిముద్దా!" అనే పేరుతో తాను వ్రాసిన వ్యాసా న్నొకదానిని నాకు చూపించింది. అందులో శ్యామల చెబుతుంది— "మానవుడి సమాజంలోనికి అయిష్టత తోనే వస్తాడు కాని, చిత్రం ఈ సమాజాన్ని విడనాడడానికి కూడా ఇష్టపడడు. కొంత కాలానికి. ఈ భూమిమీద అతన్ని అందరూ అపార్థం చేసుకునేవాళ్ళే. పసిపాపగా ఉన్నాడా దేవతతో సమంగా చూస్తారు. అదే కాస్త పిల్లవాడిగా ఎదిగాడా అందరి దృష్టిలోనూ అతడొక దెయ్యం. దానం చేసినవాడు, 'షోబిసినెస్ కోసం పాటుబడే మనిషి' గా పరిగణింపబడతాడు. చెయ్యని వాణ్ని 'లోభి' అంటారు. ఏదైనా క్లబ్బుల్లోంచి బయటకు వస్తే చాలు వాడు తాగుబోతుగానే అగపడతాడందరి కళ్ళకీ! తెలివి లేకపోతే తెలివితక్కువ వాడంటారు. తెలివున్నవాడిని నమ్మడానికే భయపడతారు! అన్ని తరహాల్లోనూ, అన్ని స్థితుల్లోనూ మానవుడిని చెడుగా అర్థం చేసుకుందికే ప్రయత్నిస్తుందీ సొసైటీ! ముసలికాలం వచ్చేవరకూ బతికాడా, వాడిపాట్లు కుక్కలు కూడా అనుభవించవు. చిన్నప్పుడే చచ్చిపోయాడా, 'పాపం, ఎంతో ఉజ్జ్వలమైన భవిష్యత్తు కల మనిషి!' అంటారు! అందుకే మానవుడి కంటె మట్టిముద్ద మేలు!"

శ్యామల రాసుకున్న పై వ్యాసాన్ని చదివిన నాటి నుండే ఆమెపై నాకొక ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. ఆమె బొంబాయి వచ్చిన సందర్భంలో, ఒకసారి ఆమెతో అన్నాను—"మనిద్దరిలోనూ చాలా పోలికలు కనుపిస్తున్నాయి. నా అభిరుచులు నీ అభిరుచులు ఇంచుమించు ఒకలాగే వున్నాయి. మనం పెళ్లి చేసుకుందుకు అడ్డేమిటి?" అని.


శ్యామల ఒకక్షణం ఆలోచించింది. "వెల్! అందుకు నా అభ్యంతరం కూడా ఏమీలేదు! అయితే మీ నాన్నగారికీ మా నాన్నగారికీ మధ్య మంచి సంబంధాలు లేవుగా! మన నిర్ణయాన్ని వాళ్లిద్దరూ కూడా మెచ్చుకోలేరేమో!" అంది.

"వాళ్లమధ్య మంచి సంబంధాలు మనం ఏర్పరుద్దాం! ఇదేమంత విడివడని సమస్య కాదే! పైగా అన్నయ్య మీ వూరు వెళ్ళిన దగ్గర్నుంచి కొంచెం పరిస్థితులు బాగు పడ్డాయి. నీ అభ్యంతరం లేకపోతే మన చదువులయ్యాక మనం వివాహమాడుదాం!" అన్నాను. శ్యామల ఒప్పుకుంది. కాని యిలా అంది "బావా డియర్, ప్రేమ వ్యవహారాలు సాగించడం, అదే పనిగా ఒకళ్ల నొకళ్ళారాధించుకోడం లాంటి వంటే నాకు చిరాకు. మన చదువులవనీయ్ చూదాం! ప్రేమించుకోడం, పెళ్లి చేసుకోడం అన్నీ ఒక్కసారే జరిగిపోవాలి! దయచేసి, ఇప్పట్నించీ ప్రేమలేఖలు మాత్రం రాయకు సుమా!"

(సశేషం)




వీరు ప్రఖ్యాత విమర్శకులు...ఇటీవలనే ఒక మహిళాసభలో వీరు స్త్రీలను తీవ్రంగా విమర్శించారు




# మంచితనం

ద్విభాష్యం సూరిడు

(గత సంచిక తరువాయి)

నా ఎం. ఎస్‌సి. చదువు పూర్తయింది. అప్పటి కేదో రెండేళ్ళ నుంచి అన్నయ్య దగ్గర నుండి ఉత్తరాలు లేవు. బహుశా తీరికలేక రాసి వుండడనుకున్నాను. నేను వూరు బయల్దేరబోయే ముందు మాత్రం ఒక వుత్తరం వచ్చింది. చాలా సాధారణంగా ఏవో రెండు ముక్కలు రాశాడన్నయ్య, అన్నయ్య నుండి అంత చిన్న వుత్తరం రావడం అదే మొదటిసారి! మా వూరు వెళ్ళిన వెంటనే, 'అన్నయ్యను చూసి వస్తానమ్మా!' అంటూ ఆ వూరు బయల్దేరాను.

అన్నయ్యను చూడగానే షాక్ తిన్నంత పని అయ్యింది. అన్నయ్యతో ఒక్కరోజు గడిపే సరికి మతిపోయినట్లయింది! అన్నయ్య అంతకు ముందన్నయ్యలా లేడు! చాలా యాంత్రికంగా జీవితం నడుపుతున్నాడు! ఇంతకుముందు తన ముఖంలో ఎప్పుడూ తాండవించే చిరునవ్వు ఎక్కడికిపోయిందో కనుపించడంలేదు. ఎవరే పనిచెప్పినా, ఎక్కువ మాట్లాడకుండా చేసేస్తున్నాడు. తానుం టున్న పోస్ట్ మాస్టారింట్లో పిల్లలందరూ, అన్నయ్య వస్తూంటే, కోపంగా చూసి, "రామారావు మంచి కాదు!" అన్నారు ఏక కంఠంతో! ఆ మాటలు నా చెవులతో వింటానని నే నెప్పుడూ వూహించుకోలేదు. తానంతలా ఎందుకు మారిపోయాడని అన్న య్యని అడిగాను "ఆ సాయంత్రం అలా షికారు కెళ్ళినప్పుడు.

అన్నయ్య చెప్పాడు—"తమ్ముడూ, ఆమె లేని ఈ యిసుక తిన్నెలెంత పేలవంగా కనుపిస్తున్నాయో చూడు! ఇంక ఆమె ఇక్క డికి రాదు. వాళ్ళు లూధియానాలో వుంటు న్నప్పుడు వాళ్ళ నాన్నగారి క్రింద పనిచేసిన కోఆఫీసరు ఆమెపై కన్నేశాట్ట! 'ఆమె'ను అతని కిచ్చి పెళ్ళి చేద్దామని వాళ్ళ నాన్నగారు కూడా అనుకునేవారుట, 'ఆమె' మా ప్రేమ విషయం ప్రస్తావించినా, వాళ్ళ నాన్నగారు తన నిర్ణయాన్ని మార్చుకోలేదుట. ఒక నాడా ఆఫీసరు ఇక్కడి కొచ్చాట్ట. ఆరోజున నేనిక్కడ లేను. ఆ మర్నాడు అందరూ కలిసి లూధియానా వెళ్ళిపోయారు. ఆమె పెళ్ళి అక్కడ జరిపించడం కోసం! అక్కడి కెళ్ళిన వెంటనే'ఆమె' ఒక వుత్తరం రాసింది. తన పెళ్ళి జరగడానికి అయిదు రోజులు వ్యవధి వుందనీ, నే నెలాగైనా వీలు చేసుకుని అక్కడికి వెళ్ళగలిగితే దేనికైనాసరే తెగించి, ఆమె నాతో రావడానికి సిద్ధంగా వుందనీ ఆ వుత్తరంలో తెలియపరచింది! ధైర్యంగా బయల్దేరదామనుకున్నాను. సైకిల్ షాపు వెంకన్న వచ్చి నాకడ్డు తగిలేడు. తన భార్యకు చాలా సీరియస్‌గా వుందనీ వెంటనే విశాఖపట్నం తీసికెళ్ళి హాస్పిటల్లో చేర్పించక పోతే ప్రాణం దక్కదనీ బ్రతిమాలాడాడు. ఆమెను హాస్పిటల్లో చేర్పించి అక్కడి నుండైనా వెళ్ళవచ్చుననుకున్నాను. హాస్పిటల్ వాళ్ళు అడిగిన డబ్బు వెంకన్న దగ్గరలేదు. నేనే సర్దుబాటు చేయవలసి వచ్చింది. హాస్పి టల్ వాళ్ళు నేనక్కడ అధమం రెండు రోజులైనా వుండడం అవసరమన్నారు. అవ తల లూధియానా, ఇవతల విశాఖపట్నం రెండూ నన్ను చెరోవైపుకీ లాగాయి. పాపం వెంకన్న అతి దీనస్థితిలో వున్నాడు. 'ఆమె' లూధియానాలో అంతకంటె దీనస్థితిలో వుందని తెలుసు! తీరా వెంకన్నకు సాయపడ కుండా అక్కడికి పోతే మాత్రం నా ప్రయ త్నం ఫలిస్తుందని హామీ యేది? పైగా నా దగ్గర సరిపోయేటంత డబ్బులేదు. ఇక్కడికి వచ్చి డబ్బు తీసుకు వెళ్ళేందుకు అధమం ఇంకో రోజు పడుతుంది. ఇంత ముఖ్యమయిన సమయంలో వెంకన్నకి సహా యం చెయ్యలేకపోతే, వూరంతా నన్నెంతగా దూషిస్తారోనని భయం వేసింది, అంతే విశాఖపట్నం నుండి కదల్లేకపోయాను. 'ఆమె' నుండి తిరిగి జాబు రాలేదు. వెంకన్న

భార్యకు భగవంతుడు ఆయుపునిచ్చాడు. ఆమెను తిరిగి యీపూరు తీసుకు రాగలిగినందుకు అందరూ వన్నెంతగానో మెచ్చుకున్నారు. ఆనాటికి ఆ సంతోషంలో ఒక్క ఘడియసేపు ఆమెను మరచిపోగలిగానంతే! మరునాటి నుండి ఏమిటో జీవితం చప్పగా కనుపించింది! అసలిక్కడికి రాబుద్ధి పుట్టడంలేదు. నాలోని జడత్వమే ఈ అనర్థానికి కారణమనుకుంటాను. నే స్వార్థపరుణ్ని తమ్ముడూ! ప్రజల నిందా వాక్యాలకు భయపడి నా జీవిత జ్యోతినే పోగొట్టుకున్నాను! ఇంతకూ మా యిద్దరికీ వివాహం జరిగేందుకు భగవదేచ్ఛ లేదనుకుంటాను.. అందుకే ఎవరి తప్పూ లేకుండా యిలా జరిగింది.''

మొట్టమొదటి సారిగా, నా కళ్లమ్మట నీళ్లు రాలాయి!నే సృష్టించుకున్న 'హీరో'కి,—నా 'రామారావు'కి—ఇంతవిషాదం సంభవించడం నేభరించ లేకపోయాను! అన్నయ్యని ఓదార్చడం కూడా మరచాను, నాహీరో నాకళ్ల ముందు విచారవదనంతో ప్రత్యక్షమయేసరికి!

నా స్థితి గమనించకుండా తన ఆవేశంలో తను చెప్పుకుపోయాడన్నయ్య. "తన చెలిమితో నా జీవితానికే వో నూతనత్వం ప్రసాదించింది. తన నవ్వులతో నాలోని ప్రతి అంగుళాన్నీ పులకరింపజేసింది. తన ఆటలతో, పాటలతో ఈ ప్రదేశాన్నే వో స్వర్గలోకంగా మార్చివేసింది. అలాంటి 'రమ', ఇక్కడి కింకరాదు! ఆమె స్నేహానికి నోచుకోని నిర్భాగ్యుణ్నవుతానని ఎప్పుడూ అనుకోలేదు. అందుకే, నా గర్వాన్ని అణచడం కోసమే భగవంతు డిలాచేశాడు.''

అన్నయ్య ఇంకా భగవంతుడి గురించి మాట్లాడ్డం నాకు చిరాకు కలిగించింది. వాడి చాదస్తమే వాడి దుస్థితికి కారణం. తనను నమ్ముకున్న ఓ అందాల పడుచు తనను కాపాడమని ఉత్తరం రాస్తే, కదల కుండా కూర్చున్నాట్ట! అంత చాతకాని తనం అన్నయ్యలో ఉంటుందని నే ననుకోలేదు. అన్నయ్య మీద జాలి కలగడానికి బదులు కోపం వచ్చింది. నా హీరో జీవితాన్ని పాడు చేశాడని!

"ఇప్పటికే చాలా ఆలస్యం చేశావు ఈ వూరు వదలిపో! సుఖంగా ఏ సిటీలోనో మంచి ఉద్యోగం చూసుకో, ఎందుకొచ్చిన అవస్థ లివన్నీ నీకు!'' అంటూ మందలించబోయాను.

కాని అన్నయ్య సంగతి మీకు తెలిసిందేగా! అనవసరంగా జీవితానికి ఒక ప్రాధాన్యత ఇస్తాడు. ఆ వూరి వాళ్ల మీద ఉరికే జాలి పడిపోతాడు. 'మానవసేవ' అనే పదంలో తనకు చాలా అర్థం కనిపిస్తుందంటాడు. వాళ్లందరికీ సహాయంగా ఉండగలిగే భాగ్యం తనకు భగవంతుడు ప్రసాదించినందుకు తానెంతో గర్వపడుతున్నానంటాడు!

అందుకే ఎంతో దర్జాగా జరగవలసిన తన జీవితాన్ని అలా పాడు చేసుకున్నాడు!!

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. నా బాధ అన్నయ్య గురించికాదు నా'హీరో' గురించి! తిరిగి నా 'హీరో'లో నూతన జ్యోతి ప్రకాశించాలి! అప్పుడే నాకు నిద్ర పట్టాలి! నా 'హీరో' కథ ఎంతో అందంగా వుంటుందని సంబరపడ్డాను. తన చేతులారా పాడు చేశాడన్నయ్య. అన్నయ్య మీద అంతుపట్టని కోపం వచ్చేస్తోంది. నిద్ర పట్టక, లేచి మంచం మీద కూర్చున్నాను. ఎదురుగానున్న మంచం మీద అమాయకంగా నిద్రపోతున్న అన్నయ్య కనుపించాడు. పాలిపోయిన చంద్రుడు కిటికీలో నుండి విచారంగా అన్నయ్య వంక చూస్తున్నాడు. అన్నయ్య మీద కోపం అంతా ఒక్కసారి మాయమయ్యింది. "అన్నయ్య రమను మరచేలా చేస్తేగాని, తిరిగి అన్నయ్య మామూలు మనిషిగా మారడు!'' అనిపించింది. "అవును! నా శాయశక్తులా ప్రయత్నించి, ఎలాగోలాగ, నే నది సాధించాలి! అన్నయ్యకు కనీసం ఈ వుపకారమైనా, చెయ్యాలి!'' అని నిశ్చయించుకున్నాను.

నాకు తెలుసు పెళ్లి చేసుకోమని బ్రతిమాలినా అన్నయ్య ఆ పరిస్థితిలో ఒప్పుకోడని! అందుకని ఆవిషయం గురించి నాన్నగారికి తెలియపరచడం కూడా అనవసరమే! మా అనుమతి లేనిదే మా పెళ్లిళ్ల విషయాల్లో జోక్యం కలిగించుకోనని నాన్నగారు ఎప్పుడో చెప్పారు మాకు!

'ఆమె'ను మరచిపొమ్మనీ, తిరిగి అంతకు ముందులా ఉత్సాహంగా కనుపించమనీ అన్నయ్యకు ఎన్నిసార్లు నూరిపోసినా, అన్నయ్యలో ఏమీ మార్పు కనుపించలేదు!

ఒకనాడు మామయ్య గారింటికి వెళ్లాను. శ్యామల ఆ మరునాడే ఆ వూరు వస్తున్నట్లు ఉత్తరం వచ్చిందని మామయ్య చెప్పారు. అన్నయ్య గురించి ఆలోచిస్తూ పాపం ఆమెకు అంతవరకూ ఉత్తరం కూడా రాయలేదని అప్పుడుగాని గుర్తు రాలేదు. ఆమె వస్తోందిగదా అని చాలా సంతోషించాను, నా భారాన్ని కొంతవరకు ఆమె కూడా భరిస్తుందిగదా అని!

ఆరాత్రి కలత నిద్రలో, మెరపులాటి ఒక ఆలోచన తట్టింది! బాగా ఆలోచించాను. ఆ ఆలోచన మంచి ఆలోచనే నని పించింది.

శ్యామల చాలా చురుకైన పిల్ల అని మీ కింతకుముందే చెప్పాను. నిజానికి రమ కంటె కూడా హుషారుగా కనుపిస్తుంది. దేన్నీ సీరియస్‌గా తీసుకోదు! ప్రేమ, జాలి, కరుణ, సేవ, మొదలైన పదాలకి నాకు లాగే ఆమెకూ అర్థం తెలియదు. జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటుంది. తాను ఏదైనా సాధించాలని నిర్ణయించుకుందా—ఎలాగోలాగ తప్పకుండా సాధిస్తుంది! శ్యామల రాగానే, మా ప్రేమ విషయం పూర్తిగా మరచిపోయి, అన్నయ్యని ప్రేమించమని చెప్పాలి! తన ఆటలతో అన్నయ్యలో తిరిగి ఉత్సాహం రగుల్కొల్పమని బ్రతిమాలాలి! అన్నయ్య 'రమ'ను మరచేలా చూసి, అన్నయ్యను వివాహ మాడడానికి తను సిద్ధపడమని కోరుకోవాలి! అదే నా ఆలోచన!

శ్యామల నా కోర్కెను మన్నిస్తుందని ధైర్యపడ్డాను. మా యిద్దరిమధ్యా ఏర్పడిన ప్రేమ పెద్ద లెక్కలోదికాదు. మా మనస్తత్వా లొకటే గనుక, పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అనుకున్నాంతప్ప, ఒకరి నొకరు అదే పనిగా ఎప్పుడూ ఆరాధించ

ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి




పూర్తికోర్సుప్యాకెట్టు 28 మాత్రలువెం రు!! సగంకోర్సుప్యాకెట్టు 14 మాత్రలువెల రు. ప్రతిచోటదొరకును

దేవిపిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్ఠుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్నిసందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును ...

2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించదు

MFRS.- SEENU & CO., MADRAS-21

స్టాకిస్టులు: సిటీ ఫార్మ డిస్ట్రిబ్యూటర్స్, రాంగోపాల వీధి, విజయవాడ-1.

సువాసనలు వెదజల్లే, మీకు సొగసు సమకూర్చే పామాలీవ్ లవెండర్ టాల్క్

మీకు నచ్చే సువాసనలు మీ కోసం తిరిగి సృష్టించ బడ్డాయి! ప్రపంచ సౌందర్య కేంద్రాలనుంచి. గతంలో సులభంగా దిగుమతి అయ్యే సువాసనల గురించి మీరు ఇక కలలు గంటూ కూర్చో నక్కర్లేదు. ఈ నాడు పామాలీవ్ లవండర్ టాల్క్‌తో, దానిలో కలసిన సువాసనలతో మిమ్మల్ని ముంచెత్తుకో గలరు. పామాలీవ్ లవండర్‌ను వళ్లు అంతా జల్లుకొని సొగసుగా వుండండి.

పామాలీవ్ లవెండర్ టాల్క్‌తో ఎప్పుడూ తాజాగా పరిమళ లావణ్యంగా వుండండి




ఇంకా, పామాలీవ్ టాల్క్ డీలక్స్ 17 మనోహరమైన సువాసనలు కలిగి ఉన్నది

PT. G.S. 7 BL.



కోడం జరగలేదు.

మరునాడు శ్యామల వచ్చింది. పరీక్ష అయిపోయాంట గనుక నిజంగా నన్ను ప్రేమించేద్దామని తను వచ్చినట్లు ఇంటికి రాగానే నాతో వేళాకోళమాడింది! నే తిరిగి ఏమీ జవాబు చెప్పకపోయేసరికి కొంచెం ఆశ్చర్యపడింది!

ఆమెను సాయంత్రం కలుసుకుంటా నని చెప్పి, అన్నయ్య గదికి వచ్చేశాను. ఆరోజు అన్నయ్య ఆఫీసుకి వెళ్లలేదు. మధ్యాహ్నం రెండు గంటలవుతుంది. అన్నయ్యా నేనూ గదిలో ఉన్నాము. తలుపు కొట్టారెవరో! తలుపు తెరిచేసరికి శ్యామల ప్రత్యక్షమయింది! కొంచెం ఆశ్చర్య పోయాము.

"హల్లో పెద్ద బావా! ఏమ్మా తమ్మైనా అసలు గుర్తున్నానా? అబ్బ! ఎంతలా మారిపోయావూ? మనం కలుసుకుని పదేళ్ళ పైగా అయింది కదూ? ముందీ బొంబాయి హల్వా కానివ్వండి. తర్వాత కబుర్లు చెప్పుకుందాం" అంటూ ఓ పేకెట్టు నా చేతిలో పెట్టింది! ఆమె చనువు, ఆ చలాకీ తనం చూసి, అన్నయ్య కొంచెం తడ బడ్డాడు. వెంటనే సర్దుకుని, చిరునవ్వు తెప్పించుకున్నాడు. పరమానందమయింది నాకు! ఫరవాలేదు! నా కార్యసాధనకి శ్యామల సరియైన సహాయం అనిపించింది. తరువాత ముగ్గురం కొంతసేపు సర దాగా కబుర్లు చెప్పుకున్నాం. అన్నయ్యతో కొంచెం మార్పు కనిపించింది!

ఆ సాయంత్రం నేనూ, శ్యామలా అలా నది వడ్డుకు వెళ్లాము. శ్యామల, పరీక్ష అయిపోయాక వచ్చిందేమో, చీకూ చింతా లేకుండా, మంచి హుషారుగా కనుపించింది. ఆమె వేళాకోళాలాడడం మొదలెట్టడానికి ముందే నే బరువుగా అన్నాను. "శ్యామలా నే నెప్పుడూ ఎవర్నీ ఏమీ కోరలేదు! నిన్ను మాత్రం ఒకే ఒక్క కోరిక కోరదల్చు కున్నాను—కాదనకుండా నా కోరిక తీరు స్తావా? తీరుస్తానంటేనే చెప్తాను!" అని.

"ఇంకా ఎందుకు బావా, ఈ ఉపోద్ఘాతా

తాలన్ని! నిన్ను ప్రేమించడానికే, నీ కోరిక తీర్చడానికే వచ్చానని చెప్పావ్వాగా! నీవు కోరబోయేదేమిటో నాకు తెలుసు. ఏమిటో చెప్పుకోనా?— నా మనసు!" కొంటెగా శ్యామల జవాబిచ్చింది.

నే చెప్పదలచుకున్న విషయం ఆమె కెలా చెప్పాలో అర్థం కాలేదు. ఒక్క క్షణం ఆలోచించి, అన్నాను— "కాదు. నేను కోరేది నీ మనసుకాదు. నీ సహాయం!"

శ్యామల కొంచెం ఆశ్చర్య పడింది. ఏలాగయితేనేం, మరికొంచెం సేపటికి నే చెప్పదలచుకున్న విషయం చెప్పేశాను. ఆఖర్ని శ్యామలను ప్రతిమాలాను. "ఆమె లేని అన్నయ్య జీవితం చాలా దారుణంగా కనుపిస్తోంది శ్యామలా! అన్నయ్య నాధారంగా చేసుకొని, ఎంతో ఉత్సాహంతో వ్రాద్దా మనుకున్నానొక కథని! 'హీరో'ని చాలా శ్రద్ధతో సృష్టించుకున్నాను ఆ హీరో గతి ఇలా మారడం నే భరించలేను శ్యామలా! నా యందు దయ ఉంచి అన్నయ్యలో తిరిగి నూతన జ్యోతిని వెలిగించు. నీ స్నేహంతో అన్నయ్య ఆమెను తేలిగ్గా మరువగలుగుతాడు. పైగా, నువ్వు తలుచు కుంటే సాధించలేని పని ఉండదు."

శ్యామల కళ్ళవెంట నీళ్ళు కారడం మొదటిసారిగా చూశాను! అన్నయ్య కథ విని జాలిపడి దుఃఖిస్తోందనుకున్నాను. కాని, శ్యామల గద్గద కంఠంతో చెప్పింది. "నా కొంటె ప్రవర్తన చూసి బహుశా నువ్వు నన్ను అపార్థం చేసుకుని ఉంటావు! నా ప్రవర్తనలో కొంచెం చురుకుపాలు ఎక్కువగా కనుపించినా, నేనూ ఆడదాన్నే బావా! క్షమించు! నా మనసు నీ కెప్పుడో ఇచ్చేశాను. ఇప్పుడు మార్చుకోడం చాలా కష్టమైన పని! మీ అన్నయ్య విష యంలో నీ కంటె ఎక్కువ జాలిపడు తున్నాను. అయినా, నీ కార్యసాధనకి నే నుపయోగించలేను. నాయందు దయ యుంచి నా మనసును అంత తేలిగ్గా అర్థం చేసుకోకు!"

ఆశ్చర్యపోయాను! శ్యామల అంత సీరి యస్‌గా మాట్లాడు తుందని నే నెప్పుడూ వూహించలేదు. అంతటితో శ్యామలను వదిలి పెట్టలేదు. ప్రతిమాలాను. అన్న య్యను ఆ స్థితిలో చూడ్డం నాకు భరింప శక్యం గాకుండా వుందని, తాను నాకీ విషయంలో సహాయం చేయక తప్పదని పట్టుపట్టేను.

"బావా, ఇంతకూ ఒక్క విషయం అడుగుతాను. జవాబు చెప్పు!" అంది శ్యామల. "పోనీ, నీకోసం పెద్ద బావని నే ప్రేమించడం మొదలెడతాననుకో! పెద్ద బావ కూడా నన్ను ప్రేమిస్తే నా గతి ఏం గాను?"

"దానికి నా సమాధానం ఉంది! అన్నయ్య నిన్ను నిరాకరిస్తే నే నుండనే ఉన్నానుగా! క్షమించు శ్యామలా. నిన్నొక పావు వులా ఉపయోగించుకుంటున్నానని అను కోకు! నీవు నా జీవిత భాగస్వామి కాబోతా వని నేనూ ఎంతో సంబరపడ్డాను! కాని, అన్నయ్యను చూసి, నిన్నీ విధంగా కోర వలసి వచ్చింది. ఎలాగైనా, నాకోసం ఈ కార్యం సాధించు" అన్నాను.

శ్యామల అయిష్టతతోనే అంగీకారాన్ని తెలియ చేసింది.

* * *

ఆ మరునాడు అన్నయ్యను అర్థం చేసుకునేందుకు కావలసిన సంగతులన్నీ శ్యామలకు వివరంగా చెప్పాను. అన్నయ్య గురించి నే రాసుకున్న విషయాలూ, అన్న య్య తిరిగి నాకు రాసిన జాబులూ అన్నీ శ్యామలకు చూపించాను.

"ఏమవుతుందో చెప్పలేను బావా! ప్రయత్నించి చూస్తాను" అంది శ్యామల! నా కెంతో సంతోషమయింది.

ఏదైనా ఒక సమస్యను పరిష్కరించ డానికి మానవుడు చాలాసేపు ఆలోచించి ఏదో ఒక మార్గంలో ముందుకు సాగ డానికి ప్రయత్నిస్తాడు. తను తొక్కిన బాట సరియైనదేనని సంతృప్తిపడతాడు. మొదట్లో! పర్యవసానం తెలిశాకగాని తను పట్టిన మార్గం సరియైనదో కాదో తేలదు. అన్నయ్యలో మార్పు తెప్పించడానికి, శ్యామ లను ఆవిధంగా కోరడంలో తప్పేమీ లేదని, అదొక్కటే మార్గమని అప్పట్లో తోచింది. అందుకే అలా చేశాను. మరేమీ లేదు— నే చేసిన పనికి మీరు నన్ను తిట్టుకుంటారేమోనని, నన్ను అపార్థం చేసు కుంటారేమోనని, ఈ మాటలు చెప్ప వలసి వచ్చింది!

ఆ మరునాటి సాయంత్రం అన్నయ్యా, నేనూ గదిలో ఉన్నాము. శ్యామల వచ్చింది. "మీరు మా యింటికి వస్తారేమోనని ఇంతవరకూ చూశాను. ఇంట్లో కూర్చుని ఏం చేస్తున్నారిద్దరూ? అలా షికారు కెళ్దాం వస్తారా?" అంటూ కుర్చీలో కూర్చుంది.



"నాకు కొంచెం తల నొప్పిగా వుంది. ఇప్పుడెక్కడికీ వెళ్ళాలనిలేదు. నన్ను క్షమించు శ్యామలా! అన్నయ్యా మీరు వెళ్ళిరండి!" అంటూ మంచంమీద కూలబడ్డాను.

అన్నయ్య కళ్ళు చిట్లిస్తూ నా కేసి చూశాడు. "అరే! ఇంతవరకూ బాగానే ఉన్నావు! అంత చప్పునెలా వచ్చిందిరా తలనొప్పి!" అన్నాడు.

"నువ్వలాగడుగుతావని తెలుసు! అప్పుడే చాలా సేపట్నించితల నొప్పిగావుంది. అనవసరంగా నిన్ను బాధపెట్టాలని ఇంతవరకూ చెప్పకుండా కాలక్షేపం చేశాను. కావాలంటే చూడింకా! టేబ్లెట్ మింగుతున్నాను!" అంటూ ఓ టేబ్లెట్టు సునాయాసంగా మింగేశాను.

పాపం, అన్నయ్య నమ్మేశాడు. శ్యామల మరోసారి బ్రతిమాలింది. అన్నయ్యను రమ్మంటూ! కాదనలేక బయల్దేరాడన్నయ్య! మేడదిగి వెళ్తున్న ఇద్దర్నీ చూడగల్గినంత వరకు చూసి మనసులో ఏదో తెలియని అనుభూతి పొందాను.

# మంచితనం


తిరిగి అన్నయ్య వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది. వస్తూనే ఆత్రంగా నావంట్లో ఎలాగుందని ప్రశ్నించా డన్నయ్య! "ఫరవాలేదు. తగ్గిపోయింది. ఆకలికూడా అవుతోంది." అన్నాను. ఫోంచేసి రావడానికి ఇద్దరం బయల్దేరాం హోటలుకి! దార్లో, అన్నయ్య శ్యామలగురించి మాట్లాడేడు. "చాలా చలాకీ పిల్ల. బలేసరదాగా కబుర్లు చెపుతుంది!" అన్నాడు. పట్టలేని సంతోషం పొందాను మనసులో! అన్నయ్య ఇంకో మాట కూడా అన్నాడు. "చాలావరకు నీలక్షణాలే!" అని! ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. శ్యామలమీద నాకేమీ ఇంటరెస్ట్ లేనట్టు, ఆమాట విననిట్టు ఊరుకున్నాను.

మరునాడు శ్యామలను కలుసుకున్నప్పుడు బ్రతిమాలు కున్నాను. "శ్యామలా! అన్నయ్య మనసెలాంటిదో నీకు చెప్పాను. బహుశా నీమనస్తత్వం కూడా దానికిసరిపోయేలా మార్చుకోవాలి! ముఖ్యంగానీ అభిరుచులూ అన్నయ్య అభిరుచులూ ఒకటే కాని అన్నయ్య గ్రహించగలిగేలా నీవు ప్రవర్తించాలి!"

ముందు కోపంగా చూచి, పళ్ళు పటపటలాడించబోయినా తరువాత మెల్లిగా ఒప్పుకుంది శ్యామల!

రోజులు మెల్లిగా జరుగుతున్నాయి. వీలయినప్పుడల్లా వాళ్ళిద్దర్నీ ఏకాంతంగా వుంచి నే తప్పించుకుబయట పడ్డానికి ప్రయత్నాలు జరుపుతూనే వున్నాను. ఇద్దరి దగ్గర్నుండీ, ఒకరిపై మరియొకరి కేర్పడుతున్న అభిప్రాయాలు కూడా తెలుసుకుంటూనే వున్నాను. మొదటి కొద్దిరోజుల్లోనూ గ్రహించగలిగిన విషయాలని బట్టి నాప్రయత్నం సఫల మవుతోందని సంతోషించి, శ్యామలతో చనువు తగ్గించుకున్నాను. ఎప్పుడైనా ముగ్గురం కలిసి మాట్లాడుకుంటూ కూర్చుంటే వాళ్ళిద్దరికీ చాలా విషయాల్లో అభిప్రాయభేదాలు కనుపించేవి. కావాలని, నేను అన్నయ్య వైపు మొగ్గేవాణ్ని. పాపం, శ్యామల నిస్సహాయ స్థితిలోపడి తప్పనిసరిగా మాతో ఏకీభవించేది.

ఒకనాడు మధ్యాహ్నం— అన్నయ్య ఆఫీసుకెళ్ళాడు. నేను వంటరిగా గదిలో వున్నాను. శ్యామలవచ్చింది. "క్షమించాలి బావా! నీకు మీఅన్నయ్య ఎంతో మంచివాడయితే అయివుండవచ్చు.! కాని ఆమంచి తనాన్ని అర్థంచేసుకోడం నాకు తెలీదు. ఇన్నాళ్ళ పరిచయం లోనూ, పెద్దబావని ఒక్కలా అర్థం చేసుకోగలిగానంతే! తను సుఖపడలేడు. తనవాళ్ళని సుఖపడనివ్వడు. ఎంత సేపూ పైవాళ్ళ బాధ్యతలు నెత్తినవేసుకోడం, విశ్రాంతిలేకుండా తిరగడం— ఇవే బావకు తెలుసు. రేపొద్దున్న తను పెళ్ళి చేసుకున్నాగాని ఇంటి బాధ్యత పట్టించుకునే రకంలా కనుపించటంలేదు. మనిషిమంచివాడేకాని, ఈకాలంలో నెగ్గించుకువచ్చే వాడుకాడు. బహుశా నీవు చూస్తూనే వుంటావు. ఒక్కొక్కప్పుడు తెల్లవారకుండా ఇల్లువిడిచి పోతాడుట, తిరిగి వచ్చేసరికి రాత్రి పదకొండు గంటలో అవుతుందట! ఇవన్నీ వినడానికే భయంగావుంది. రేపు కాపరం



కేయడం ఎంత కష్టంగా వుంటుందో ? నేనింతవరకూ సుఖంమరిగినదాన్ని! ఒక వేళ పెళ్ళాడినా గాని, బావని సుఖపెట్ట లేనేమోనని భయంగావుంది.! ప్లీజ్ ! నామాట విను బావా! ఇంక ఈ ప్రయ త్నం నుండి విరమించుకుందాం!" అంటూ చాలా జాలిగా చెప్పింది.

నేను మెత్తబడలేదు. అన్నయ్యకొన్నాదారి కోపపడుతున్నాడని సంతోషిస్తున్న నేను శ్యామలమాటలను హర్షించలేకపోయాను. శ్యామలను మళ్లీ ప్రతిమాలుకున్నాను.నన్నింక మరచిపొమ్మని ప్రాధేయపడ్డాను. శ్యామల అర్ధాంగీకారంతో వెళ్లి పోయింది.

వేసుకున్న ప్రయత్నం, నాకుతెలియ కుండానే ఒక 'ఎటర్నల్ ట్రయాంగిల్'ని సృష్టించింది. ఒకనాడేదో ఆలోచిస్తూం డగా ఉత్తనే అవిషయం తట్టిందినామన సులో! 'ఎటర్నల్ ట్రయాంగిల్'వున్న కథలను ఎన్నింటినో మీరు చదివివుంటారు. వాటితో మీలో చాలా మంది విసుగెత్తి పోయివుంటారు.! నిజానికి నేనూ అంతే! కానినేను కావాలని సృష్టించిందికాదు ఈ ట్రయాంగిల్! దానంతటదే సృష్టింప బడింది. కొంచెం జాగ్రత్తగా ఆలో చించాను. 'ఎటర్నల్ ట్రయాంగిల్'లో ఏదో క్రొత్తదనం గోచరించింది. విడమ రచిచెప్తే మీరూ ఒప్పుకుంటారు! శ్యామలకు అన్నయ్య మీద దృష్టి లేదు. నాకు శ్యామలమీద దృష్టి లేదు. అన్నయ్య అభిప్రాయం ఎలాగుందో తెలియదు! ఈవిషయం గుర్తుకు వచ్చాక మా కథ ఎలానడుస్తుందో, ఎలాలంతమవుతుందోనని నాకుచాలా భయంగా వుండేది. నేవేసిన పథకంప్రకారం, వాళ్లిద్దరూ పెళ్లిచేసుకొని అన్నయ్య సౌఖ్యవంతమైనజీవితం గడుపుతూ కనుపిస్తేచాలునని ఎంతగానో కోరుకునే వాణ్ని. ఇక్కడ మీలో చాలామందికితట్టి నట్టుగానే నాకూ ఒకవూహతట్టేది అప్పు డప్పుడు—అన్నయ్యగాని శ్యామలగాని ఏదైనా అయిపోతారేమోనని! ఆ వూహతట్టి నప్పుడల్లా గుండె గుభేల్మనేది. నాప్రయ త్నంలోకి అనవసరంగా దిగేనేమోనని అనిపించేది!

ఒకనాడు రాత్రి ఎనిమిది గంటలయినా గాని, అన్నయ్య ఇంటికి రాలేదు. నాకు చాలా ఆకలయ్యింది. అన్నయ్యకోసం వేచి యుండడం లాభం లేదనుకొని హోటా లుకి బయల్దేరాను. తిరిగి నే వచ్చేసరికి అన్నయ్య గదిలో ఉన్నాడు. అన్నయ్య చాలా అలసిపోయినవాడిలా, వాడిపోయిన ముఖంలో కనుపించాడు. అన్నయ్యను ఆ వాలకంలో చూడ్డం మొదటిసారి కాదు నాకు. "బాగా ఆకలయ్యింది. నీ గురించి వెయిట్ చెయ్యకుండానే వెళ్లిపోయాను. బాగా అలసటగా ఉన్నట్టున్నావు. కేరేజి మీల్సు తీసుకురానా?" అంటూ క్షమా ర్పణ చెప్పుకున్నాను.

"ఏం ఫరవాలేదు. భోంచేసివచ్చినందుకు చాలా థాంక్స్! తప్పు నాదే! చాలా ఆలశ్యం చేశాను. నేను కూడా భోంచేసి వస్తా" నంటూ బయల్దేరాడు!

రాత్రి పది గంటలయినా అన్నయ్య రాలేదు. ఏదో పుస్తకం చదువుకుంటూ నాకు తెలియకుండానే నిద్రపోయాను.

నాకు మెలకువ వచ్చేసరికి మరునా డుద యం ఆరు గంటలయింది. అన్నయ్య గదిలో కనుపించలేదు. బహుశా ఎక్కడి కేనా వెళ్లివుంటాడనుకొన్నాను. ముఖం తోముకుని, కాఫీకోసం బయల్దేరదామను కుంటున్నాను. టేబుల్ మీద వో కవరు కన్పించింది. ఆత్రంగా విప్పి చూశాను. ఆ కవరులోనున్న ఉత్తరంలో ఇలా రాసివుంది.

"తమ్ముడూ! ఈ నెల్లాళ్ళూ నా దగ్గ రుండి నా మనో వ్యథను కొంత మరపింప చేయగలిగావు. ధన్యవాదాలు. నేనే తెలివైన వాణ్ణని నేను గర్వపడుతూండేవాడిని! నన్ను మించిన తెలివి నీలో ఉందని తెలుసు కుందుకు సంతోషిస్తున్నాను.

శ్యామలను మొదటి రెండు రోజు ల్లోనే అర్ధం చేసుకోగలిగాను. నీకు సరి యైన పత్నిగా ఉంటుందని అనుకు న్నాను. భార్యా భర్తలుగా మీ రిద్దరూ రాణించగలరని మురిసిపోయాను. కాని, శ్యామల నాతో చనువుగా మాట్లాడ్డం నీవు ఆమెపై నిర్లక్ష్యం వహించడం చూసి ఆశ్చర్యం కలుగుతూండేది! నీవు బొంబాయిలో చదువుతున్నప్పుడు ఆమె గురించి రెండు మూడు విషయాలు రాసి నట్టు గుర్తు! అప్పటినుండే అనుకునేవాణ్ణి మీ రిద్దరూ పెళ్లి చేసుకుంటే బాగుం టుందని!

రెండు మూడు రోజుల్నుండీ శ్యామల చాలా వింతగా ప్రవర్తిస్తోంది. నాకేమీ అర్ధం కాలేదు ముఖా ముఖిగా నిన్న సాయం త్రం అడిగేసింది. "బావా, నన్ను పెళ్లి చెసు కోడం నీకిష్టం లేదా?" అని. కొంచెం తబ్బి బ్బయాను. నా అభిప్రాయాన్ని శ్యామలకు చెప్పేశాను. "నాకంటె తమ్ముడే నీకు సరి యైనవరుడుగా ఉంటాడు! నన్ను పెళ్ళి చేసుకుందుకు నిర్ణయించుకున్నా వెందుకు శ్యామలా? నీకు కష్టం కలిగించకపోతే ఒక చిన్న కోరిక—నీ అభిప్రాయం మార్చుకో! తమ్ముడిని ప్రేమించు!" అన్నాను. శ్యామల దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. ఎందుకో అర్ధం కాలేదు నాకు. ఏదో దాచి వుంచుతోం దని తెలుసుకోగలిగాను. కళ్ళల్లోకి నిదానంగా చూసి, నిజం చెప్పమని ప్రతి మాలాను. ఆవేశంలో రెండే రెండు మాటలు అనేసింది శ్యామల—"నేను శూర్పణఖలా కనుపిస్తున్నానేమో మీ యిద్దరన్నదమ్ము లకీ! నిన్ను ప్రేమించమని ఆ బావ చెప్తాడు. ఆ బావని ప్రేమించమని నువ్వు చెప్తావు! నా మనసు మీకో ఆట వస్తువులా కని పిస్తోందనుకుంటాను! మానెయ్యండి! మీలో ఎవరూ నన్ను పెళ్లాడనద్దు!" కళ్ళ నీళ్ళు తుడుచుకుని గబ గబ నడిచి వెళ్ళి పోయింది. ఆశ్చర్యంగా అలాగే నిలబడి పోయాను తమ్ముడూ! ఇంటికి వచ్చేసరికి నీవు గదిలోలేవు. ఏదో తెలియని ఆవేశంలో నీ పెట్టి తెరిచి, నీ డైరీ చదివేశాను! ఈ పనికి నన్ను క్షమించు తమ్ముడూ! నాకోసం నీవు చేయబోయిన త్యాగానికి ఎన్నో ధన్య వాదాలు!

ప్రేమించిన యువతిని పోగొట్టుకొన్న నిర్భాగ్య స్థితిని అనుభవించిన వాణ్ణే నేను. ఆ దుస్థితి నా తమ్ముడు కూడా అనుభ వించడం నే చూడలేను! నీ కా స్థితి కల్పించ డానికి కారణం నేనే కనుక, ఈ నిర్ణయా నికి వచ్చాను—ఇంక మీ యిద్దరి మధ్య

మంచి నే తప్పుకోవాలని! నీ ప్రయత్నం మానుకుని, ఆమెతో సుఖంగా జీవించు— నే కనుపించనులే!

శుభాశీస్సులతో
నీ అన్నయ్య."

చేతులు గజగజలాడాయి. ఏమి చేయాలో అర్థం కాలేదు. వెంటనే వెళ్ళి శ్యామలని కలుసుకున్నాను. శ్యామల నాపై వాలిపోయింది. మా ఎటర్నల్ ట్రయాంగిల్ మాట గుర్తుకు వచ్చింది. మంచివాడైన అన్నయ్య ముఖం. పెద్దదై, మరింత పెద్దదై ఆకాశంలో కనుపించింది!

జరిగిన విషయం నాన్నగారికెలా చెప్పాలో అర్థం కాలేదు. ఇంత మంచి పుత్రుణ్ణి పోగొట్టుకున్నామని తెలిస్తే అమ్మ, నాన్నగారు ఎంతలా దుఃఖిస్తారో ఊహించుకొని నా మనసు సాంతం కలవరపడిపోయింది. ఆ సాయంత్రం వరకూ పూరాం డర్నే అన్నయ్య గురించి వాకబు చేశాను. అన్నయ్యలేని ఆ పూరు—ఎంతో నిర్జీవంగా కనుపించింది. ఆ సాయంత్రం బండికి మా పూరు వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. స్టేషనుకి శ్యామల కూడా వచ్చింది.

బండి ఎక్కుతూన్న నన్ను ఆత్రంగా పిలిచింది శ్యామల—"బావా! పెద్దబావ!" అంటూ ఒక వైపు తన చెయ్యి చాచి చూపించింది. అటువైపు చూశాను! అన్నయ్య! వెంటనే బండిదిగి, మా వైపు వస్తున్న అన్నయ్యను గాఢంగా కౌగిలించుకున్నాను! "తమ్ముడూ!" అంటూ అన్నయ్య నన్ను దగ్గరకి తీసుకున్నాడు. అన్నయ్య స్పర్శతో నా ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లుమంది. అన్నయ్య తన వెనుక వస్తున్న 'రమ'ను చూపించాడు వెంటనే నిర్ఘాంతపోయాను!!

"కంగారుపడకు తమ్ముడూ, ముందు వాళ్ళ నాన్న గార్ని కలుసుకో. ఆమె వెనుకనే వస్తున్నారు చూడు. ఆయనే!" అంటూ అన్నయ్య నన్ను ఆయనకు పరిచయం చేశాడు. ఆరడుగుల పొడవున్న ఆ డిఫెన్సు ఆఫీసరుగార్ని చూస్తే, ఆయనకు అరవై యేళ్ళుంటాయా అనిపించింది!

"వెల్! అందరం ముందు ట్రావెలర్స్ బంగళాకు వెళ్దాం! ఈ రాత్రికి మే మిప్పగం అక్కడవుండి, రేపు ప్రొద్దున్నే మా ఊరు వెళ్దాం. రాత్రి భోజనాలు మాతో పాటే మీరంతా తీసుకొందురుగాని సావకాశంగా కబుర్లు చెప్పుకోవచ్చు!" అంటూ సామానంతా కూలివాడి నెత్తిన వేశారాయన.

* * *

హోటలయ్యరే మా అందరికీ భోజనా లక్కడికి తెచ్చి ఏర్పాటు చేశాడు. భోజనా లయాయి. పూల మొక్కల మధ్య అందరం కూర్చున్నాం. మంచి చుట్ట వెలిగించారు డిఫెన్సు ఆఫీసరుగారు. "జరిగినసంగతంతా నే చెప్తాను, ఇఫ్ యు పెర్మిట్ మి!" అంటూ అన్నయ్యకేసి, రమ వైపు చూశారు. "యస్ ప్లీజ్!" అన్నారు. వాళ్ళిద్దరూ చిన్నగా నవ్వారు ఆయన ప్రారంభించారు.

"మీరంతా మంచివాళ్ళు! కాని, రాటుకి పోటుకి ఆగే శక్తి మీలో ఒక్కళ్ళకు కూడా ఉన్నట్టు కనుపించదు. పిరికితనానికి, ఈ వయసులో దానియ్యకూడదు! రామారావులోని ఆ పిరికితనమే నాకు నచ్చలేదు. క్షమించాలి. ధారవగా మాట్లాడుతున్నందుకు! ఒకనాడేదో మాటల సందర్భంలో తను రామారావుని ప్రేమిస్తున్నట్టు చెప్పింది అమ్మాయి. ఒక్కగానొక్క కూతురు! దానికి రాబోయే భర్త నాకు కూడా నచ్చాలిగదా! ఆమరునాడే ఉద్యోగార్థి రావు గురించి జాగా ఆచూకీ తీశాను. ఎవళ్ళనడిగినా రామారావు దేవుడివంటివాడనే సమాధానం చెప్పారు. దూరాన్నుంచి అతని ప్రవర్తన కూడా చూశాను. ప్పుర వాడు చూడ్డానికి చాలా బావున్నాడుగాని, ఆ వయసుకి అతనిలో ఉండవలసిన కరుకుతనం కనిపించలేదు. పైగా అంత మెత్తగా వుండే వ్యక్తిని సుఖపడనివ్వ రెవ్వరూ! అలాంటి వాడిని పెళ్ళి చేసుకున్నదిమాత్రం ఏం సుఖపడగలదు? అని అనుకున్నాను. అయినా అతన్ని పరీక్షించి మరీ ఒక నిర్ణయానికి వద్దామనుకొన్నాను. నాకు చాలా కావలసిన స్నేహితుడొకడు లూధియానానుండి ఉత్తరం రాశాడు. వాళ్ళమ్మాయి వివాహానికి నేను తప్పకుండా రావాలని! నిజానికి నాకు కూడా కొన్ని స్వంత పనులుండి పోయాయి. సకుటుంబంగా అక్కడకు వెళ్ళడం తప్పనిసరయ్యింది. ఆ అవకాశాన్ని రామారావుని పరీక్షించడానికి వినియోగించుకొందామనుకుని, అమ్మాయి రాసినట్టు ఆ ఉత్తరాన్ని నేనే రాసి పోస్ట్ చేశాను. రామారావు ఆ ఉత్తరం చూసి అక్కడికి పరుగెత్తుకుంటాడు అని ఊహించుకున్నాను. అతను రాకపోయినందుకు కొంచెం విచారించాను కూడా! పాపం అమ్మాయి అతనికి రాసే ఉత్తరాలన్ని పోస్ట్ కాకుండా చేశాను రెండు నెలలపాటు. అతన్ని ఎలాగోలాగ మరచిపోతుందని! అమ్మాయి ధోరణి మారకపోయేసరికి ఒకనాడు జరిగిన సంగతంతా చెప్పి, అతను తనకు తగిన వరుడు కాదని, అతన్ని మరచిపొమ్మని అమ్మాయిని బతిమాలాను! అమ్మాయి అంతలా బాధపడుతుందని నే ననుకోలేదు. నాకు కూతురుగా పుట్టిన ఆమెకి అంత జాలి, ప్రేమ, సేవాబుద్ధి ఎలా కలిగాయో తెలియక ఆశ్చర్యపోయాను. ఆమె కళ్ళమ్మట నీళ్ళు చూడలేకపోయాను. ఆమె నిర్ణయం ప్రకారమే జరగడానికి బయల్దేరి వచ్చాం. ఇక్కడుంటే అబ్బాయి పాడవుతాడని, అబ్బాయిని అక్కడే మిల్ట్రీలో చేర్పించేశాను! అంతే! అంతకంటె మరేమీ పెద్ద బ్రహ్మాండమైన దేదీ జరిగిపోలేదు."

ఎంతో తేలిగ్గా మాట్లాడేశా రాయన! ఆశ్చర్యపోయాం మేమిద్దరం. వెంటనే 'రమ' చెప్పింది. "నాన్నగారూ! చిన్న పాయింట్! నిర్మలమైన ప్రేమతో ప్రయాణం చేస్తే, మనిషి కష్టాల్లో భగవంతుడే సహాయపడతాడు! ఆ సెకిండ్ షోవు వెంకన్న ఏదో కారణంగా రమణారావుని నిన్న విశాఖపట్నంలో ఆపుచేయకపోతే మనం ఆ స్టేషన్‌కు రాకముందే రమణారావు ఆ ముందు బండిలోనే ఎక్కడికో వెళ్ళిపోయేవాడు. అప్పుడు పరిస్థితులెంత బాధాకరంగా ఉండేవో మీరే ఆలోచించండి! రమణారావు నిష్కళంకమైన వ్యక్తి! స్వీట్ లెన్ పర్సన్!" అంది.

"హియర్! హియర్!" అంటూ ఆయన చప్పట్లు చరిచారు నవ్వుతూ! అప్రయత్నంగానే అందరం ఒకసారి నవ్వేశాం. మంచితనం అంటే ఏమిటో నాకు మాత్రం బోధపడలేదు.